క్లుప్తంగా

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


బహుమతులు అందజేస్తున్న లింగస్వామి

రామన్నపేట: విప్లవ కవి గద్దర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బతుకమ్మ కళావేదిక వ్యవస్థాపకుడు, ఐఎన్టీయూసీ జిల్లా యూత్ అధ్యక్షుడు తాటిపాముల లింగస్వామిగౌడ్ అన్నారు. గద్దర్ జయంతి సందర్భంగా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాటిపాముల కిరణ్‌కుమార్, దోడ రవీందర్‌రెడ్డి, కాకి చందు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


రాజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

గుండాల: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మలిపెద్ది మాధవి మామ మలిపెద్ది రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరిశంకర్‌గౌడ్, మాధవరెడ్డి, గడ్డమీది పాండరి, చలపతిరావు, మొగులాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.


రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కోడి భవ్య, గాదె వైష్ణవి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. సీత డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరిలోని సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం చెరో రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. వారివి హత్యలని తేలితే చట్టపరంగా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చీరబోయిన రాజయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మ సుదర్శన్, రేగు శ్రీశైలం, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు ఆర్. ఉదయ్ ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

మోత్కూరు: భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని, వారి ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు దాసరి తిరుమలేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ.. కోడి భవ్య, గాదె వైష్ణవి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు భరోసా ఇవ్వాలన్నారు.

మోత్కూరు వాసికి రంగస్థల సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎండీ గుంషావళి

మోత్కూరు: యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి, రచయిత ఎండీ గుంషావళికి జాతీయ రంగస్థల సేవారత్న అవార్డు లభించింది. ఈ అవార్డును ఆదివారం హన్మకొండలో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతులమీదుగా ఆయన అందుకున్నారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్

అడ్డగూడూరు: మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అడ్డగూడూరు మండలానికి చెందిన ఎలిజాల ప్రవీణ్‌ను నియమించినట్లు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ రాజు తెలిపారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క దేవేందర్‌రావు చేతులమీదుగా ప్రవీణ్ నియామక ప్రతం అందుకున్నారు.

కలగానే క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం

- బీబీనగర్ పరిధిలోని ఇస్రాయిపల్లిలో ఐదెకరాల అసైన్డ్ భూమి కేటాయింపు
- ఆ భూమిపై కొనసాగుతున్న వివాదం
- ఆగిపోయిన నిర్మాణ పనులు

బీబీనగర్: మండల కేంద్రంలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) నిర్మాణంతో ప్రజలకు ఇప్పటికే మెరుగైన వైద్య సేవలు చేరువవుతున్నాయి. అదేవిధంగా బీబీనగర్‌లో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి బీజం పడింది అనుకున్నప్పటికీ అది కాస్త కలగానే మిగిలిపోయింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగుల కోసం యాదాద్రి భువనగిరి జిల్లాలో మొట్టమొదటిసారిగా క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించేందుకు సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు అడుగులు ముందుకు వేశారు. కానీ ఏడాది దాటినా ఇంత వరకు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

ఐదెకరాలు కేటాయింపు..

బీబీనగర్‌లో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించేందుకుగాను సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు స్థానిక ఎంపీపీ సుధాకర్‌గౌడ్ సహకారంతో అప్పటి ఆరోగ్య


క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం కోసం ఇస్రాయిపల్లి కుంటలో ఎంపిక చేసిన స్థలం ఇదే..

శాఖ మంత్రి హరీష్‌రావును కలిసి ప్రభుత్వ స్థలం కోసం విన్నవించారు. ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బీబీనగర్ పరిధిలోని ఇస్రాయిపల్లి కుంట వద్ద సర్వే నంబర్ 517లోని ఐదెకరాల అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించారు. కానీ ఆ భూమి గతంలోనే ఇతరులకు కేటాయించినట్లు తెలియడంతో నిర్మాణ పనులు ప్రారంభించడం లేదని సమాచారం. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించడంతో 2023 జనవరి 16న భూమిపూజ చేశారు. స్థలాన్ని చదును చేసి వదిలేశారు. స్థలం వివాదం పరిష్కారం కోసం ట్రస్ట్ ప్రతినిధులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

ఆస్పత్రి నిర్మాణం జరిగేలా కృషిచేస్తాం



జిల్లాలో క్యాన్సర్ బాధితుల కోసం సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు బీబీనగర్‌లో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన గొప్ప విషయం. ఈ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం జరిగితే ఎంతోమంది బాధితులకు మేలు జరుగుతుంది. ట్రస్టు ప్రతినిధులు ఆస్పత్రి నిర్మాణానికి చేస్తున్న కృషిని జిల్లా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం జరిగేలా కృషి చేస్తాం.

– పోట్లోళ్ల శ్యాంగౌడ్, బీబీనగర్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

ఆలేరురూరల్: మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గ్యార శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం మృతుడి కుటుంబానికి రూ.12వేలు ఆర్థిక సాయం, 50కిలోల బియ్యం, 15 కిలోల నూనె అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నోముల చందు, పేరపు స్వామి, పేరపు సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో..

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన నాగు నవీన్ ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు పూస బాలకిషన్ రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

గుండాలలో..

గుండాల: మండలంలోని వస్తాకొండూర్ గ్రామానికి చెందిన బాదె ఆగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబానికి శ్రీరామలింగేశ్వరస్వామి గోశాల ఆధ్వర్యంలో ఆదివారం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల హేమలత, పూర్ణచంద్, గోశాల అధ్యక్షుడు చెట్టుపల్లి పరశురాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరులో..

మోత్కూరు: మున్సిపాలిటీలోని బుజిలాపురం గ్రామంలో సారగండ్ల మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఈసీ మెంబర్, బీఆర్ఎస్ నాయకుడు కోక భిక్షం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అంబటి భిక్షం, సారగండ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ అధికారికి సన్మానం


సుమన్ కళ్యాణ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు, వ్యాపారులు

చౌటుప్పల్: జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్‌ను ఆదివారం స్థానిక విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరందాసు ధనుంజయ్య మాట్లాడుతూ.. అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సుమన్‌కళ్యాణ్ అందరి మన్ననలు పొందుతున్నారని అన్నారు. అదేవిధంగా మెడికల్ అసోసియేషన్, సోమనాథ క్షేత్ర కమిటీల ఆధ్వర్యంలోనూ సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో విద్యానగర్‌కాలనీ అధ్యక్షుడు మండలోజు సుభాష్‌చంద్రాచారి, ప్రధాన కార్యదర్శి ముత్యాల హన్మంతరెడ్డి, వర్తక సంఘం, కిరాణం, మెడికల్ అసోసియేషన్‌ల అధ్యక్షులు వీసం చంద్రారెడ్డి, ఢిల్లీ శంకర్‌రెడ్డి, అయ్యాడపు ప్రతాప్‌రెడ్డి, ప్రతినిధులు వనం రాజు, దండెం సత్తిరెడ్డి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


భాస్కర్‌ను సన్మానిస్తున్న శాలివాహన సంఘం నాయకులు

భువనగిరి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌ను ఆదివారం భువనగిరి పట్టణంలోని శాలివాహన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాడూరి అంజయ్య, కార్యదర్శులు తాడూరి బాలశంకర్, మడికొండ కృష్ణ, కోశాధికారి తాడూరి కుమార్, మాజీ కౌన్సిలర్ తాడూరి భిక్షపతి, నాయకులు గోపాల్, చిన్నగారి కృష్ణ, బాలమల్లేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

భువనగిరి రూరల్: మండల పరిధిలోని నందనం గ్రామానికి చెందిన మట్ట ఆంజనేయులు తండ్రి మట్ట కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆదివారం కిష్టయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు చందా మహేందర్, పిట్టల అశోక్, జిల్లా కార్యదర్శి కొండం ఉపేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పోచంపల్లి మండలంలో ప్రత్యేక అధికారులు వీరే..

భూదాన్‌పోచంపల్లి: సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెం, దోతిగూడెం, పిలాయిపల్లి (ఎంపీడీఓ బాలశంకర్), జగత్‌పల్లి, పెద్దగూడెం (తహసీల్దార్ వీరాబాయి), కనుముకుల, మెహర్‌నగర్ (ఏఈఈ మమత), ఇంద్రియాల, పెద్దరావులపల్లి, శివారెడ్డిగూడెం (మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్), దేశ్‌ముఖి, జూలూరు, సాయినగర్ (ఎంపీఓ మాజీద్), గౌస్‌కొండ, కప్రాయిపల్లి, రాంలింగంపల్లి (ఏఈఈ లింగయ్య), భీమనపల్లి, జలాల్‌పురం, జిబ్లక్‌పల్లి (డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు), దంతూర్, ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి (ఏఈఈ స్వప్న) ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

యూత్ కాంగ్రెస్ ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా పవన్

మోత్కూరు: యూత్ కాంగ్రెస్ ఆర్‌టీఐ విభాగం మోత్కూరు మండల అధ్యక్షుడిగా అన్నెపు పవన్ నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సల్లా నరేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు భువనగిరిలో ఆదివారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, సుంకిశాల అనిల్, తీగల వినోద్, దొండ శ్రీశైలం తదితరులున్నారు.

విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న రమేష్ మాదిగ

మోటకొండూర్: ఎస్సీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ.. కోడి భవ్య, గాద వైష్ణవి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, కుసంగి కిరణ్, బొట్ల అశోక్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం


మాట్లాడుతున్న అశోక్

భువనగిరి: విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి. అశోక్ అన్నారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో ఏర్పాటు చేసిన ప్రేరణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలల్లో సైకాలజిస్ట్‌లు నిర్వహించే అవగాహన సదస్సులను ఉపాధ్యాయులు, విద్యాశాఖ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఉన్నత లక్ష్యాల నిర్ణయం, సాధన, తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం యూనియన్ నాయకులు కట్టా శేఖర్,ఉపాధ్యాయులు సువర్ణ, రజిత,పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

రామన్నపేట: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కంచి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మంకాల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా టేకుల మల్లారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా కస్తూరి సోని, కోశాధికారిగా జనపాల చిననర్సింహ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిలువేరు అనిల్‌కుమార్, కట్ట క్రిష్ణ, సిరిసాల క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

వలిగొండ: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గుండు కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం వలిగొండ మండలంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుక్క శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా పెర్క బాబు, ప్రధాన కార్యదర్శిగా చేగూరి అజయ్, కార్యదర్శి పెర్క భిక్షం, కోశాధికారిగా ఎడవెల్లి చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

రామన్నపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని రామన్నపేట పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు.. రామన్నపేట మండలం తుర్కపల్లి గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తీసుకొచ్చి లారీలో లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఇతరుల సహాయంతో పోలీసులు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆర్టిస్టులకు ఐడీ కార్డుల పంపిణీ

యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్టుల సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆర్టిస్టులందరికీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బైరపాక లక్ష్మణ్ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం 50 సంవత్సరాలు నిండిన కళాకారులు మామిడాల కిష్టయ్య, కోటగిరి ఉపేందర్ దంపతులను సన్మానించగా.. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి రూ.5వేలను ఆర్టిస్టుల సంక్షేమానికి అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి చెల్ల జహంగీర్, సోషల్ మీడియా కన్వీనర్ నీల పెద్దిరాజు, కోటగిరి ఉపేందర్, తుడుం గణేష్, వీరచారి, మామిడాల కిష్టయ్య, ఎస్.ఎన్.చారి తదితరులున్నారు.

సేవా సమితి కమిటీ ఎన్నిక

రామన్నపేట: మండలంలోని సిరిపురం శ్రీదాశరథి సేవా సమితి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కంకల మల్లేష్, అధ్యక్షుడిగా పగుడాల శివగణేష్, ఉపాధ్యక్షుడిగా రాపోలు నరేష్, ప్రధాన కార్యదర్శిగా సిల్వేరు సురేష్, కార్యదర్శులుగా కూనూరు శ్రవణ్‌కుమార్, కూనూరు నవీన్‌కుమార్, కోశాధికారిగా రాపోలు అవినాష్, సభ్యులుగా రాపోలు అమరేందర్, కూరెళ్ల ఉపేంద్రాచారి, రవ్వ వీరస్వామి, కూనూరు సాయి, కడవేరు శ్రీకాంత్, ఎలె శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

ఎస్‌ఐకి సన్మానం

వలిగొండ: వలిగొండ నూతన ఎస్‌ఐ మహేందర్ లాల్‌ను మండలంలోని ఆరూర్, నరసాయగూడేనికి చెందిన కాంగ్రెస్ నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల శ్రీనివాస్, తుమ్మల సంతోష్, బాలస్వామి, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శ్రీమార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి ఆలయ 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్ తెలిపారు. ఆదివారం దేవాలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి రాజారమేష్, డైరెక్టర్లు పాలాది యాదగిరి, మంగళపల్లి రమేష్, భోగ సిద్ధిరాములు, గోలి యాదగిరి, కర్నాటి భార్గవి, సీత కృష్ణ, పట్నం పారిజాత పాల్గొన్నారు.

మాజీ పాలకవర్గ సభ్యులకు సన్మానం


భువనగిరి: వలిగొండ మండలం పహిల్వాన్‌పురం మాజీ సర్పంచ్ తుమ్మల వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


భూదాన్‌పోంచపల్లి: ధర్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సామ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

భువనగిరి: వలిగొండ మండలం పహిల్వాన్పురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ తుమ్మల వెంకట్‌రెడ్డి పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ధనుంజయ్య, నీల కృష్ణమూర్తి, బొడ్డుపల్లి భిక్షపతి, వనగంటి సత్యనారాయణ, కస్తూరి సత్యనారాయణ, రాగీరు బాలరాజు, ఏనుగు మాధవరెడ్డి, వనగంటి మహేష్ యాదవ్, రాగీరు రమేష్, బందారపు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్: మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులకు ఆదివారం స్థానికంగా ఉన్న బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ చిన్నం లావణ్యమల్లేష్‌తో పాటు పాలకవర్గాన్ని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మెమొంటోలు బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, ఎంపీటీసీ జెల్ల ఈశ్వరమ్మ, మాజీ ఉప సర్పంచ్ కొంతం రామకృష్ణారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త కొంతం భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పగిళ్ల శశికళ, ఊదరి జయమ్మ, ఏనుగు రవీందర్‌రెడ్డి, పిశాటి బాలమణి, జంగం నవీన్, ముటుకుల్లోజు ఉమ, గుర్రం రవీందర్, డాకోజి లలిత పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గనగాని మాధవీమల్లేశంగౌడ్, మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు సభ్యులను ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, అంగన్‌వాడీ టీచర్ యశోద, ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్ర నర్సిరెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ధర్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డితో పాటు మాజీ ఉప సర్పంచ్ సుర్వి కాటంరాజు, మాజీవార్డు సభ్యులను ఆదివారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్‌తో పాటు గ్రామస్తులు సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరమేష్, మాజీ వార్డు సభ్యులు సుర్వి భిక్షపతి, క్లైం రేణుక, బల్లూరి సత్తిరెడ్డి, కాటేపల్లి పుష్పలత, బిజిలి లక్ష్మమ్మ, ఎడ్ల కృష్ణ, ఎడ్ల లక్ష్మమ్మ, కోఆప్షన్ సభ్యులు వరకాంతం నర్సిరెడ్డి, ఎడ్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరులో..

మోత్కూరు: మండలంలోని ముశిపట్ల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పైళ్ల విజయనర్సిరెడ్డి, మాజీ వార్డు సభ్యులను ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొల్లు రమేష్ గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కేమిడి మల్లేష్, మాజీ వార్డు సభ్యులు కొల్లు సునీత, గోశెట్టి పావని, బుషిపాక శ్రీను, కొల్లూరి జ్యోతి, మొయినొద్దీన్, చాగంటి లత, మాజీ సర్పంచ్ తండ సత్తయ్య, గ్రామ పంచాయతీ కారోబార్ వేముల సుదర్శన్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): పోతిరెడ్డిపల్లిలో..

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని జాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంధమల్ల నర్సింహులు, మాజీ వార్డు సభ్యులు, మాజీ కోఆప్షన్ సభ్యులను ఆదివారం గ్రామస్తులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


చౌటుప్పల్: ధర్మోజిగూడెంలో..


మోత్కూరు: ముశిపట్లలో..


రాజాపేట: జాల గ్రామంలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుండాల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ఆలేటి సంజీవరెడ్డి, మన్నె అంజయ్య, మోత్కూరు బ్రహ్మచారి, జయపాల్‌రెడ్డి, శ్రీపతి నరేందర్, విద్యా వలంటీర్లు వెంపటి రమేష్, దేవనబోయిన అయిలయ్య, నేవూరి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని బేగంపేట, చల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వేర్వేరుగా నిర్వహించిన ఆత్మీ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు, గురువులు వంచ ఉపేందర్‌రెడ్డి, అనుమల ప్రభాకరాచారి, బాలయ్య, రఘు, మాధవి, వెంకన్న, క్రిస్టోఫర్, రవీంద్రచారి, జోసఫ్, పోరెడ్డి రంగయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ బోగ హరినాథ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


గుండాల: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు


రాజాపేట: బేగంపేట జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్


నియామక పత్రం అందుకుంటున్న ఉపేందర్

భువనగిరిటౌన్: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాల్వేరు ఉపేందర్‌ను నియమిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన నియామక పత్రం అందుకున్నారు.

టోల్‌ప్లాజా వద్ద రద్దీ

బీబీనగర్: హైదరాబాద్ – వరంగల్ హైవేపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడం, శుభకార్యాలు కూడా ఉండడంతో జంటనగరాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు భారీగా తరలి రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు గూడూరు గ్రామ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద వానాల రద్దీ నెలకొంది


గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు